క్లుప్తంగా

చల్లగా చూడమ్మా.. పెంటమాంబమ్మా...



పూజలందుకున్న పెంటమాంబ

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం పెంటమాంబ అమ్మవారి తీర్థం నిర్వహించనున్నారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావుయాదవ్, ఆలయ ధర్మకర్త నమ్మి అచ్చియమ్మయాదవ్,గౌరవ అధ్యక్షుడు రంగులభక్తు అప్పలరాజు దంపతులు అమ్మవారికి పసుపు,కుంకుమలతో పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక మహిళలు అమ్మవారి పీఠం ముందు భక్తి కీర్తనలు ఆలపించారు. సోమవారం సాయంత్రం ఆలయం వద్ద భారీ ఎత్తున తీర్థ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న చందనం అరగదీత



చందనం అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత ఆదివారం కూడా కొనసాగింది. ఈ నెల 23న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని స్వామికి రెండో విడతగా మూడు మణుగుల(120 కిలోలు) పచ్చి చందనం సమర్పించనున్నారు. దీనిలో భాగంగా తొలిరోజు శనివారం 40 కిలోలు చందనం అరగదీయగా రెండో రోజు ఆదివారం 37 కిలోల చందనాన్ని అరగదీశారు. రెండు రోజుల్లో 77 కిలోల చందనం సమకూరింది. సోమవారం కూడా చందనం అరగదీత చేపట్టనున్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా శ్రీవారి రథోత్సవం



రథంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం స్వామివారు వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో రథంపై చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందించారు. తప్పెటగుళ్లు, కోలాటాలు, మేళతాళాలతో ఊరేగింపు అత్యంత సందడిగా సాగింది. మంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవంలో ఈవో నీలిమ, ఎంఎస్ రాజు, సీఐ రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన దుకాణాలు

- ఇబ్బంది పడుతున్న పారిశ్రామిక ప్రాంతవాసులు
- ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న ప్రయాణికులు
- చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రహదారిపై పార్క్‌చేసిన వాహనాలు



మల్కాపురం - సింధియా రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణాలు

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో ఇటు శ్రీహరిపురం నుంచి అటు సింధియా వరకు రహదారులపై దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా జంక్షన్ వరకు అధిక సంఖ్యలో రోడ్లకు ఇరుపైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతమంతా నిత్యం రద్దీగా మారుతోంది. ఫలితంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా వారాంతపు రోజుల్లో ఈ సమస్య మరీ అధికంగా ఉంటోంది.

జటిలంగా ట్రాఫిక్ సమస్య..

గతంలో కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా అటు గాజువాక.. ఇటు శ్రీహరిపురం, మల్కాపురం మార్కెట్‌లను తాత్కాలికంగా మూసివేయడంతో దుకాణదారులు ప్రధాన రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు మొదలుపెట్టారు. అక్కడికి వచ్చే వారితో ప్రతి రోజూ రద్దీ నెలకొంటోంది. సరైన పార్కింగ్ స్థలం లేక వాహన చోదకులు తమ వాహనాలను రోడ్లపైనే పార్క్‌చేస్తున్నారు. కరోనా ఆంక్షలు ఎత్తేసినా కూడా దుకాణదారులు రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది.

కష్టతరంగా రాకపోకలు..

రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు, వాహన చోదకులు చెబుతున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతం గాజువాక నుంచి సింధియా మీదుగా నగరానికి వెళ్లడానికి రోజు వందల కొద్దీ వాహనాలతో ప్రజలు ప్రయాణిస్తుంటారు. కళాశాలలు, ఉద్యోగాలు, ఆస్పత్రులు.. ఇలా వివిధ పనుల మీద వెళ్లేవారు ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ రోడ్డులోనే కోరమాండల్, హెచ్‌పీసీఎల్ సంస్థలకు వచ్చే భారీ వాహనాలు పార్క్‌చేసి రోజుల తరబడి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య రెట్టింపవుతోంది.

రాంగ్ పార్కింగ్ చేస్తున్న వాహనాలకు జరిమానాలు విధిస్తున్నా.. రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వారికి అవగాహన కల్పిస్తున్నా.. వారిలో మార్పు రావడం లేదని అధికారులు అంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నాం



మా ప్రాంతంలో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తుండటంతో మార్గం ఇరుగ్గా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు పరిశీలించి చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది.

– మజ్జి మాలినాయుడు, మల్కాపురం దుర్గానగర్

నిత్యం రద్దీగా ఉంటోంది



దుకాణాల వద్ద కొనుగోలు చేయడానికి వచ్చే వారితో మా ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉంటోంది. కొనుగోలుదారుల వాహనాలను రోడ్డు మీదే పార్క్‌చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వీటిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించాలి.

– దాసరి రవి, ప్రకాశ్‌నగర్

పారిశ్రామిక ప్రాంతంలో కొత్త వెలుగులు



నక్కవానిపాలెం నుంచి శ్రీహరిపురం మార్గంలో లైట్ల వెలుగులు



జింక్ నుంచి గాజువాక ఆర్టీసీ డిపో మార్గంలో వెలుగులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి నూతన శోభ వచ్చింది. అంధకారంలో ఉన్న పలు ప్రాంతాలు కాంతులీనుతున్నాయి. వీధిదీపాల నిర్వహణపై అధికారులు దృష్టిసారించడంతో అంధకార సమస్య తొలగిపోయిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 40,58,59,60,61,62,63వ వార్డుల పరిధిలో సుమారు 200 కొత్త లైట్లు అమర్చారు. అలాగే మల్కాపురం,శ్రీహరిపురం,కోరమాండల్, గాజువాక ఆర్టీసీ డిపో,జింక్ ప్రధాన మార్గాల్లో విద్యుత్ షో ల్యాంప్స్‌ను జీవీఎంసీ విద్యుత్ విభాగ సిబ్బంది మార్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కాంతులు విరబూస్తున్నాయి.

'ఆడారి' గెలవాలని శివాలయంలో నేడు పూజలు

సింధియా: పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అత్యధిక మెజారిటీతో గెలవాలని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించి ప్రజలకు సంక్షేమాభివృద్ధిని అందించాలని కోరుతూ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలోని శివాలయంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం 6 గంటల నుంచి ఆలయ ప్రధానార్చకుడు వెంకట సూర్యకామేశ్వరరావు వేద ప్రవచనాలతోపాటు ప్రత్యేక అభిషేకాలు, హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ నాగేశ్వరరావు తెలిపారు.

బయోమెట్రిక్‌తో బాగోతం బట్టబయలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారంలో బయోమెట్రిక్ హాజరు అమలుతో కాంట్రాక్టర్ల బాగోతం బయట పడుతోందని సమాచార హక్కు చట్టం కార్యకర్త, విశాఖ ఉక్కు కార్మిక సంఘం మాజీ నాయకుడు పట్టా రామ అప్పారావు ఆరోపించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్రపతి, సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయో మెట్రిక్ విధానం అమలు కాని రోజుల్లో ఒక కాంట్రాక్టర్ పేరుతో రెండు మూడు పనులకు కాంట్రాక్ట్ పొందుతూ ఒక చోట పని చేసే కార్మికుల్నే రెండు మూడు చోట్ల పని చేస్తున్నట్టు చూపించి బిల్లులు దండిగా వసూలు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. బయోమెట్రిక్ అమలు చేసిన తర్వాత సుమారు ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు తక్కువగా జాబితాలో కనపడుతుందన్నారు. వాస్తవాలు బయట పడాలంటే పది సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేసిన వారి ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు పరిశీలించాలన్నారు.

కోలాహలంగా ఎర్నిమాంబ జాతర





ఆలయంలో కొలువైన ఎర్నిమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పుగా కొలిచే ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆలయ ఈవో డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పూలఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

నగరంలోని పలు ప్రాంతాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది భక్తులు సుమారు 252 అమ్మవారి ప్రతిమలతో దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ చైర్మన్, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షించారు.



మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సాధనతోనే కళాకారుల రాణింపు



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న సంగీత విద్వాంసుడు ద్వారం త్యాగరాజు

సీతంపేట: సరస్వతి అమ్మవారి ప్రతిరూపంగా సంగీతం ఆవిర్భవించిందని సంగీత విద్వాంసుడు ద్వారం త్యాగరాజు అన్నారు. అన్నమాచార్యుని జయంతిని పురస్కరించుకుని శృతిలయ సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ సారథ్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా త్యాగరాజు జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కళాకారుడికైనా భక్తి, శ్రద్ధ, ఏకాగ్రత, సాధన ఎంతో అవసరమని, సాధనతోనే ఉత్తమ సంగీత కళాకారులుగా రాణిస్తారన్నారు. తేనె వంటి తెలుగు పదాలతో వేంకటేశ్వర స్వామిని సంకీర్తన రూపంలో కీర్తించిన ఘనత అన్నమాచార్యుడికే దక్కిందన్నారు. మంచి కార్యక్రమం నిర్వహించారని శృతిలయ సంస్థ వ్యవస్థాపకులను అభినందించారు. ఈ నెల 23న అన్నమాచార్య జయంతి రోజున విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో సుమారు 300 మంది కళాకారులు సంగీతంపై తమకున్న ప్రతిభ చాటారు.

కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, శృతిలయ సంస్థ కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కొణతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సిహెచ్.వి.సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, కె.మంజుల, శారద, సుజని పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



చిన్నారులు వేస్తున్న డ్రాయింగ్‌ను పర్యవేక్షిస్తున్న అతిథులు



పోటీలో భాగంగా పెయింటింగ్స్ వేస్తున్న చిన్నారులు

మల్కాపురం: చిత్రకళా పోటీల్లో పాల్గొనడం ద్వారా చిన్నారుల్లో సృజనాత్మకత వెల్లివిరుస్తుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు.మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా శాఖా గ్రంథాలయంలో ఆదివారం పలువురు చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా చేయవద్దన్నారు.చిన్నారులు ఈ సెలవు దినాల్లో చిత్రలేఖనం,స్పోకిన్ ఇంగ్లిష్, నచ్చిన క్రీడలు,నీతి కథలు ఇలా శిక్షణ తీసుకుంటే అవి వారి ఉజ్వల భవితకు ఎంతో దోహదపడుతుందన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రముఖ రచయిత కరుకు సత్తిరాజు, ప్రముఖ న్యాయవాది విశ్వనాథ్‌రాజు వ్యవహరించారు.పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు జ్ఞాపికలతో పాటు,సర్టిఫికెట్లు అందించారు. గ్రంథాలయాధికారి అజేయ్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత నాయకుడు సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించి నినాదాలు చేస్తున్న నాయకులు

సింధియా: దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత, మహోన్నత నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని కమ్యూనిస్ట్ పార్టీ మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 63వ వార్డు క్రాంతినగర్, చింతల్లోవ గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. చింతల్లోవలో ఆర్.లక్ష్మణమూర్తి, జోన్ కార్యదర్శి పైడిరాజు, పొన్నాడ రామారావు, క్రాంతినగర్‌లో గ్రామసంఘ అధ్యక్షుడు కె.పరదేశినాయుడు తదితరులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన నిరాడంబర మనిషి సుందరయ్య అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోన్ నాయకులు కె.పెంటారావు, ఆర్.విమల, పి.సురేష్, గోపాల్, కె.రాము, దుర్గాప్రసాద్, ఆదినారాయణ, నరేష్, వి.నీలయ్య, హరి, సత్తిబాబు, బి.అర్జునరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ ఉత్సవం





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు
దుర్గమాంబ నిజరూపం (ఇన్‌సెట్)

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ వాసుల ఆరాధ్యదైవం దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆలయ ధర్మకర్త ఎరిపిల్లి అప్పారావు నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 16 గ్రామాల ఇలవేల్పుగా కొలుచే దుర్గమ్మను భక్తులు అధిక సంఖ్యలో వేకువజాము నుంచే దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలతో విశేష అభిషేకాలు పూజలు జరిపారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలీసుల బందోబస్తు నడుమ ఉత్సవాన్ని జరిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



పూర్వ ఉపాధ్యాయులతో ఆర్పీ పేట హైస్కూల్ 2006-07 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కంచరపాలెం: కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని ఆనందంగా గడిపారు. 2006–07 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తమ పూర్వ ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 17 ఏళ్ల కిందట పాఠశాలలో చదువుకున్న మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని వ్యక్తిగత జీవిత విశేషాలను అడిగి తెలుసుకున్నారు.

నాటి గురువులకు మెమెంటోలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఉత్తమ విద్యను అందించి తమ జీవితాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు ఎంతో రుణపడి ఉంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి కె.సత్యనారాయణకు ఎలక్ట్రికల్ బెల్‌ను తమ గుర్తుగా అందించారు. పూర్వ విద్యార్థులంతా ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నారాయణరావు, బి.సత్యనారాయణ, ప్రభాకర్, అరుణకుమారి, హేనా, సుమలత, హరినాథ్, శ్వేత, నాగేశ్వరరావు, ఎల్.చైతన్య, ఎస్.ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీదళార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణ తులసీదళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఎంవీపీ రైతుబజార్ సందర్శన

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌ను ఆదివారం మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.శేఖర్‌బాబు సందర్శించారు. రైతుబజార్‌లో భారత్ శనగ పప్పు, మార్క్‌ఫెడ్ ఉత్పత్తుల విక్రయాలను పరిశీలించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించిన శనగపప్పు విక్రయాలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఎన్ని కిలోల శనగ పప్పు విక్రయం జరిగిందో అడిగి తెలుసుకున్నారు.

ప్రస్తుతం వినియోగదారుల కోసం అందుబాటులో ఉన్న మార్క్‌ఫెడ్ ఉత్పత్తుల గురించి సిబ్బంది ఆరా తీశారు. విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని హెచ్చరించారు.